# ఇరవైకోట్ల బంగారం

## వసుంధర

హోటల్ నటరాజ్ — రూమ్ నంబర్ పదిహేడు —

డిటెక్టివ్ కిల్లర్ మంచంమీద పడుకొని పైన తిరుగుతున్న ఫ్యాను వంకే చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అతడి ఆలోచనలనిండా బ్లూ హార్సెస్....

బ్లూ హార్సెస్ అంటే అదో సంస్థ. చాలా ప్రమాదకరమైన సంస్థ. ఆ సంస్థలో పనిచేసే వారందరూ ఇండియన్సు. సంస్థకు డబ్బు అమెరికానుంచి వస్తుంది. ఆదేశాలు పాకిస్తాన్ నుంచి వస్తాయి. దేశంలోని యువత మనసును కలుషితంచేసి — తమకనుకూలంగా ప్రభావితం చేయడం ఆ సంస్థ ఆశయం.

అణ్వస్త్రప్రయోగంవల్ల దేశాలు నాశనమైపోతాయి. భవనాలు కూలిపోతాయి. మనుషుల ప్రాణాలు పోవడమటుంచి మిగిలినవారిని శతాబ్దాలపాటు జాడ్యాలు పట్టుకుంటాయి. ఒక దేశం మరో దేశాన్నేలాలనుకుంటే అణ్వాస్త్రాలు పనికిరావు. ఒకదేశం మరో దేశాన్ని

శాసనం చేయాలనుకున్నప్పుడే అణ్వస్త్రాలు కావాలి.

భారతదేశం విశాలమైనది. విశిష్టమైనది. భారతదేశంపై ఏ దేశం సర్వాధికారాలూ సంపాదించుకుంటుందో—ఆ దేశం ప్రపంచ దేశాలన్నింటినీ సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, సైనిక పరంగా శాసించ గలదు. అందుకే అగ్రదేశాలన్నింటికీ భారతదేశమంటే ఆకర్షణ.

కానీ భారతదేశం స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి వుంది. అగ్రదేశాలకు తను దూరంగా ఉండడమేకాక—బడుగు దేశాలకు తనే నాయకత్వం వహించి—వాటిని కూడా అగ్రదేశాలకు దూరంగా అలీనంగా వుంచుతోంది. భారతదేశంలో కల్లోలం సృష్టించడానికే—అగ్రదేశాలు భారతానికి పొరుగున వున్న దేశాలకు — అమితంగా ఆయుధాలను సరఫరా చేస్తుంటాయి. పొరుగు దేశపు ప్రజలకు నోరు లేకుండా చేయడానికి—ఆయా దేశాలలో ప్రజారాజ్యం లేకుండా చేస్తుంటాయి.

ఆ విధంగా ఎంతోకాలంగా భారతానికి పొరుగు దేశమైన పాకిస్తాన్ మిలిటరీ పాలనలో మగ్గుతోంది. పాలకులు తమ పరిపాలనా దౌష్ట్యం కొనసాగించడానికీ, అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి — పాకిస్తాన్ ప్రజలలో పొరుగుదేశంపట్ల ద్వేషం పుట్టే ప్రచారాలు చేస్తూ భారతదేశంలో అల్లకల్లోలం పుట్టించడానికి సర్వదా ప్రయత్నిస్తుంటారు. అలాంటి ప్రయత్నాల ఫలితాల్లో ఒకటి బ్లూ హార్నెస్.

బ్లూ హార్నెస్ సంస్థలోని సభ్యులు పద్దెనిమిది. వారి ధనబలం అంతులేనిది కావడంవల్ల—ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు—ఎక్కడ కావాలనుకుంటే అక్కడ—

ఎలా కావాలనుకుంటే అలా అల్లకల్లోలాన్ని సృష్టించ గల్గుతున్నారు. ప్రభుత్వానికి తమ ఉనికి తెలియకుండా ఆ సంస్థ సభ్యులు తమ మకాం తరచుగా మార్చేస్తూ ఉంటారు. ఆ సభ్యుల ధనబలం—రాజకీయ ప్రభావానికి లోబడి పోలీసు బలగాన్ని నిర్వీర్యుల్ని చేస్తోంది.

భారతీయ గూఢచారులు బ్లూ హార్సెన్ గురించి అన్వేషిస్తున్నారు. బ్లూ హార్సెన్‌కు కొందరు స్వార్థపరులైన రాజకీయ నాయకులు సాయపడుతూండడంవల్ల—వారి ఆన్వేషణ ఫలించడం కష్టంగా వుంది. అలా కష్టపడుతున్న వారిలో ఏజంట్ 127 ఒకడు.

అతడు బ్లూ హార్సెన్ గురించి కొంత సమాచారం సేకరించగలిగాడు. ఆ ప్రకారం బ్లూ హార్సెన్ విశాలపురంలో ఉన్నట్లు అతడికి తెలిసింది. ఏజంట్ 127 ఒక పోలీసినస్పెక్టర్ ద్వారా డిటెక్టివ్ కిల్లర్‌కి ఓ కవరందజేశాడు. ఆ కవర్లోని ఉత్తరంలో—

"డియర్ డిటెక్టివ్ కిల్లర్! నీ శక్తిసామర్థ్యాలనిప్పుడు యావద్భారతదేశం గుర్తించింది. దానికి తోడు నీకు నియమాల శృంఖలాలు లేవు. మన దేశానికి ప్రమాదకరంగా తయారైన బ్లూ హార్సెన్ సంస్థ గురించి నాకు కొంత పనికివచ్చే సమాచారం దొరికింది. ఇప్పుడా సంస్థను బట్టబయలు చేయగలననే నేనాశిస్తున్నాను. అందుకు నేను ప్రభుత్వ సహాయంకాక నీ సహాయం తీసుకోదల్చుకున్నాను. ఈ ఉత్తరం అందిన వెంటనే నీవు విశాలపురం బయల్దేరి వెళ్ళు. హోటల్ నటరాజ్‌లో రూం నంబర్ 17 నేను నీ పేరున బుక్ చేసి ఉంచుతున్నాను.

అందులో మకాం పెట్టు. నేను నిన్ను కంటాక్ట్ చేస్తాను—

నీ స్నేహితుడు—ఏజంట్ 127."

కిల్లర్ వెంటనే విశాలపురం చేరుకుని హోటల్ నటరాజ్‌లో మకాం చేశాడు. అతడిక్కడకు వచ్చి మూడు రోజులయింది. ఏజంట్ 127 జాడ లేదు.

ఈలోగా కిల్లర్ ఊరికే కూర్చోలేదు. నగరంలో సంఘవిద్రోహక శక్తులేమున్నాయోనని విచారించి పరిశోధనలు చేశాడు. అతడి పరిశోధనల్లో వెంటనే బయట పడిందో సంస్థ. దాని పేరు "మాస్టర్ కీ."

మాస్టర్ కీ ఒక అంతర్జాతీయ సంస్థ. భారతదేశంలో దాని హెడ్డాఫీసు ఢిల్లీలో వుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రముఖ నగరాల్లోనూ దానికి అనుబంధ సంస్థలున్నాయి. వివిధ అంతర్జాతీయ నేరసుల సంస్థలకు స్థానికంగా అవసరమైన సేవచేసే సంస్థ అది.

కిల్లర్ ఆ సంస్థ సభ్యుల గురించి కొన్ని వివరాలు సేకరించగలిగాడు. వారందరూ నగరంలోని ప్రముఖ వ్యక్తులు. వారివంక తేరిపార చూడ్డానికి స్వయాన—ఆ భగవంతుడే వచ్చినా—ధైర్యం చేయలేదు.

"మాస్టర్ కీ" సంస్థ "బ్లూహార్స్"కి సహాయపడుతూనే ఉండివుండాలి. ఆ రెండు సంస్థలనీ సమూలంగా నాశనం చేయగలిగితే — దేశానికి పట్టిన పీడ వదిలిపోతుంది. కానీ అదంత సులభంకాదు.

మాస్టర్ కీ సంస్థ గురించి చాలా సులభంగా తను వివరాలు సేకరించగలిగాడు. అంటే ఆ సంస్థ కార్యకలాపాలు చాలా వరకూ బహిరంగంగానే జరుగుతున్నాయి. అందులో ఆశ్చర్యం లేదు.

బొంబాయి రైల్వేస్టేషన్ వద్ద కొన్ని కిలోమీటర్ల పొడవున — స్మగుల్డు వస్తువులు అమ్మకానికి లభిస్తాయి. ఏళ్ళతరబడి జరుగుతున్న చట్టవిరుద్ధమైన విశేషమిది! అది పోలీసులకు తెలియదని గానీ — వారు చట్టవిరుద్ధంగా స్మగుల్డు వస్తువులమ్మేవారని పట్టుకుని శిక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని గానీ — భావించలేం కదా! ఈ స్మగుల్డు వస్తువుల అమ్మకం బొంబాయి నగరానికే పరిమితంకాదు. ఢిల్లీ, కలకత్తా, మద్రాసువంటి మహానగరాల నుంచి అలమూరువంటి చిన్న పట్టణాలవరకూ విస్తారంగా వ్యాపించి వున్న బహిరంగ నేరమది!

బ్లూ హార్సెన్ గురించి విశాలపురంలో అతడికే విధమైన సమాచారం లభించలేదు. ఏజంటు 127 ఆ సమాచారం తెలియజేయగానే బ్లూహార్సెన్‌కీ మాస్టర్‌కీకీ ఉన్న సంబంధాల్ని పట్టుకోవాలని ఆలోచిస్తున్నాడు కిల్లర్.

ఆ సమయంలో మంచం పక్కనే ఫోన్ మ్రోగింది.

“హలో!” అన్నాడు కిల్లర్ రిసీవర్ తీసి.

“కిల్లర్‌గారేనా? నేను — రమణను మాట్లాడుతున్నాను. మా యింట్లో దొంగలు పడ్డారు. అర్జంటుగా మీరు రావాలి. మా యిల్లు గాంధీనగర్‌లో వడియాల వారి వీధిలో ఉంది. ఆ వీధిలో పచ్చరంగు డాబా అదొక్కటే. మీరు సులభంగా గుర్తుపట్టగలరు....” అందవతలి గొంతు.

“రమణగారూ? మీరెవరో నాకు తెలియదు....”

“మా యింటి నంబరు నూటయిరవై ఏడు. కానీ వడియాలవారి వీధిలో నంబర్లు సరిగ్గా ఉండవు. మీరు మాత్రం పచ్చరంగు డాబాను చూసుకునిరండి. మీకోసం

ఎదురుచూస్తూంటాను. మిగతా విశేషాలు మనం కలుసుకున్నాక మాట్లాడుకుందాం....” అందతని గొంతు.

ఫోన్ చేసింది ఏజంటు 127 అని కిల్లర్‌కర్థమయింది. అతడు వెంటనే మంచంమీంచి లేచాడు.

## 2

పచ్చరంగు డాబాను సులభంగానే కనుక్కున్నాడు కిల్లర్. ఇంటిముందో చెక్కగేటుంది. అతడా గేటు తీసుకుని ఇంటి గుమ్మందాకా వెళ్ళాడు. కాలింగ్ బెల్ ప్రయోగించాలనుకునేలోగా తలుపులు తెరుచుకున్నాయి.

“కమాన్ డిటెక్టివ్—” అన్నాడో ఆజానుబాహువు.

కిల్లర్ అతణ్ని పరీక్షగా చూశాడు.

సన్నగా పొడవుగా వున్నాడతడు. మీసాలు లేవు. చురుకైన కళ్ళు, సూటిముక్కు. చూడగానే అందగాడనిపిస్తుంది. కానీ మనిషిలో యేదో నిర్లక్ష్యముంది.

“ఇంటి నంబరు 127....అవునా?” అన్నాడు కిల్లర్.

“అవును....లోపలకు రా”—అన్నాడతడు.

కిల్లర్ లోపలకు వెళ్ళాడు.

విశాలమైన హాల్లో మధ్య సోఫాలున్నాయి. ఇద్దరూ సోఫాలో పక్కపక్కనే కూర్చున్నారు.

“ఈ యిల్లు ప్రభుత్వ గూఢచారి శాఖది. ఇక్కడ చాలా సదుపాయాలున్నాయి. శత్రువులు నన్ను కనిపెట్టారు. ఎలాగో ఈ యింట్లో ప్రవేశించాను. అది నా అదృష్టం. నేనిందులోంచి బయటకు రావడమెలాగో తెలియడంలేదు. చివరకు నీకు ఫోన్ చేశాను..” అన్నాడు ఏజంటు 127.

“ఈ యింట్లోంచి నీవెందుకు బైటకు రాలేవు?” అడిగాడు కిల్లర్.

"శత్రువులు వేయి కళ్ళతో యీ ఇంటిని గమనిస్తు న్నారు...." అన్నాడు ఏజంటు 127.

"ఎలా తెలుసు నీకు?"

"ఈ యింటికి వేయిగజాల ఆవృతంలో ఏం జరుగు తున్నదీ నేను తెలుసుకోగలను ......" అన్నాడు ఏజంట్ 127.

"ఈ యింట్లో యింకెవరూ లేరా?"

"ప్రస్తుతం నేనే వున్నాను. మా గూఢచారి శాఖ మనుషులు — ఈ యింట్లోకి యెప్పుడు కావాలంటే అప్పుడు రాగలరు. ఈ యింటి తలుపులను కోడ్ వర్డ్సతో తెరవ్వచ్చు...."

"సరే—ఇంతకీ నాతో పనేమిటి?"

"ఇప్పుడు నావద్ద అత్యంత ప్రమాదకరమైన సమా చారముంది. అది నేను అర్జంటుగా మా చీఫ్‌కు అంద జేయాలి. కానీ...."

"ఊఁ" అన్నాడు కిల్లర్.

"శత్రువులు నన్ను కనిపెట్టారు. వాళ్ళు నన్ను వేటాడతారు. వాళ్ళనుంచి తప్పించుకుని నేను సమా చారాన్ని చీఫ్‌కందజేయాలి...."

"నిన్ను కనిపెట్టిన శత్రువులు—నీకోసం ఈ ఇంట్లో ప్రవేశించి నిన్నెదుర్కోలేరా?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్యంగా.

"అదే ఈ యింటి ప్రత్యేకత. కొన్ని మీటలు నొక్క డంవల్ల—ఈ యింటి చుట్టూ కనిపించని కాంతికిరణాలు ప్రసరిస్తూంటాయి. అవి మనిషి మెదడుపై విచిత్రమైన ప్రభావాన్ని చూపించడం కారణంగా మనిషికి గేటు దాటి రాగానే వెనక్కు తిరిగి వెళ్ళిపోవాలనిపిస్తుంది.

కారణం ఆ మనిషి ఊహించలేడు...."

"అయితే నేనెలా రాగలిగాను?"

"చెప్పానుగా — ఇంటికి వేయిగజాల ఆవృతంలో జరిగేవన్నీ నేను తెలుసుకోగలను. నీ రాకను గమనించి కాంతికిరణాలలో చిన్న మార్పు తీసుకుని వచ్చాను. అందువల్ల నీ వొక్కడివీ మాత్రం లోపలకు రాగలిగావు. నిన్నెవరైనా అనుసరించి వస్తూంటే వాళ్ళు లోపలకు రాలేరు...."

"నేను నీకు తెలుసా?"

"నీవు నాకు తెలియడమే కాదు. నీవే కిల్లర్ వనడానికి కూడా ఋజావు — నీవీ యింట్లోకి రాగలగడం!" అన్నాడు ఏజంట్ 127.

"అంటే?"

"నేను కాంతికిరణాలలో యెలాంటి మార్పు తీసుకుని వచ్చానంటే—అవి కేవలం నీ శరీరాన్ని మాత్రమే లోపలకు రానిస్తాయి. నీ వేషంలో మరో వ్యక్తి వచ్చినా లోపలకు రానివ్వవవి..."

"అదెలా సాధ్యం?"

"డియర్ కిల్లర్! సైన్సు సాధిస్తున్న ప్రగతి గురించి నీకు తెలియదా? ఏ యిద్దరు మనుషుల శరీరాలూ — ఈ ప్రపంచంలో సరిపోలడం అసాధ్యమని నీకు తెలియదా? కాంతికిరణాల ప్రభావం ఒకో శరీరంపై ఒకోవిధంగా ఉంటుందని నీ వూహించలేవా? అన్నీ కలిపి కొందరు సైంటిస్టులు సృష్టించిన పరికరాలీయింట్లో అమర్చబడి వున్నాయి...."

"వెరీగుడ్!"

"అందుకే నేను కావలసిన వాళ్ళందర్నీ—ఇక్కడే

కలుసుకుంటాను...." అన్నాడు ఏజంట్ 127.

"అంటే నా శరీరం గురించిన సమాచారమంతా నీ వద్ద ఉన్నదన్నమాట! మరి అలా సమాచారం లేని వాళ్ళను లోపలకెలా రానిస్తావు?"

"చాలా సింపుల్........తాత్కాలికంగా కాంతికిర ణాలనుపసంహరించగలను...." అన్నాడు ఏజంట్ 127.

"ఇన్ని సదుపాయాలుండీ — మన దేశ ప్రజలకు న్యాయం జరగడంలేదు. వారికి సరైన రక్షణలేదు...." అన్నాడు కిల్లర్ విచారంగా.

"అవును. కానీ అందుక్కారణం చాలావరకూ ప్రజలే!"

"ఎలా?"

"తాము సుఖపడతూ—తమ ప్రజల నా సుఖాలకు దూరం చేస్తున్న నాయకుల నెన్నుకున్న దెవరు? ఆ ప్రజలే కదా...."

"అవును—కానీ వారు—అమాయకులు...."

"వాళ్ళు అమాయకులు కాదు. అవకాశవాదులు. దూరదృష్టి లేకుండా తాత్కాలిక ప్రయోజనాల కాశపడి తమ గొయ్యి తామే తవ్వుకునేవారు....సరే—అదంతా మనకెందుకులే కానీ—ఇప్పుడు నువ్వే నాకు సాయ పడాలి "

"చెప్పు...."

"మనదేశంలో అయిదు ప్రాంతాల పాకిస్తాన్ ప్రభుత్వం ఆయుధాల కర్మాగారాలు నెలకొల్పింది. వాటిలో తయారయ్యే ఆయుధాలు — టెర్రరిస్టులకు చేరుతున్నాయి...." అన్నాడు ఏజంట్ 127.

"అదెలా సాధ్యం?"

"ఎలా సాధ్యపడిందన్న విషయం తర్వాత ఆలో చించాలి. ముందు వెంటనే ఆ కర్మాగారాలనైడింటిఫై చేయాలి...."

"అందులో కష్టమేముంది?"

"డియర్ డిటెక్టివ్! మనదేశంలో సాధారణ ప్రయో జనాలకు పనికివచ్చే ఆయుధాలను తయారుచేసే కర్మా గారాలు చాలా వున్నాయి. వాటిలో ఓ అయిదు పాకిస్తాన్ ప్రభుత్వానివని యెవరికీ తెలియదు. నాకూ అనుకోకుండా ఈ ఊరొచ్చాకే తెలిసింది...."

"ఎక్కడున్నా యవి?"

"ఆ విషయం తెలియలేదు. కానీ వాటికి ఆదేశాలు పంపుతూ కానిస్తున్న వ్యక్తి గురించి నేను తెలుసుకున్నాను. ఆ వ్యక్తి ప్రభుత్వ రంగంలో ప్రముఖుడుగా చెలామణీ అవుతున్నాడు. విషయం బైటపడితే అతడిట్టే తప్పించు కోగలడు. తన విషయమై సాక్ష్యాలు, రుజావులు లేకుండా చేసి నన్నే తుదముట్టించగలడు...."

కిల్లర్ ఆశ్చర్యంగా—"ఎవరా వ్యక్తి?" అన్నాడు.

"అతడి పేరు చెప్పడం శ్రేయస్కరం కాదు...."

"వివరాలేం తెలుసుకోకుండా నేనేం చేయగలను?"

"నువ్వు చేయాల్సిందీ పనికాదు—మరొకటి...."

"ఏమిటది?"

"రేపుదయం ఏనిమిది గంటలకు—నిర్ణీత స్థలంలో— సుమారు ఇరవైకోట్లు విలువచేసే బంగారం—విదేశాల నుంచి వస్తుంది....ఆ సమాచారం బ్లాహార్సన్ కంటే ముందుగా నేను తెలుసుకున్నాను...."

"ఎలా?"

"బ్లాహార్సన్కు సంబంధించిన ఓ వ్యక్తికి ఆ సమా

చారం అందజేయబడింది. ఆ వ్యక్తిని నేను పట్టాను. అతడు ప్రమాదకరమైన వ్యక్తి కావడంవల్ల నేనతణ్ని తుదముట్టించాల్సి వచ్చింది. అతడి వద్దనే నాకు ఆయుధ కర్మాగారాల విశేషం కూడా తెలిసింది. అది తెలియగానే నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఈలోగా కొందరు వ్యక్తులు నన్ను వెంటాడారు. నేను పారిపోయి ఈ ఇంట్లో చేరాను. వాళ్ళు లోపలకు రాలేక నాకోసం బయట కాపలా వేశారు. నేను నీకు ఫోన్ చేశాను. ఇప్పుడు నేను ఆ కర్మాగారాల విషయం చూస్తాను. నువ్వు బంగారం పని చూడాలి—" అని ఆగాడు ఏజంటు 127.

కిల్లర్ ఉత్సాహంగా — "ఇరవై కోట్ల బంగారం అంటే—చాలా థ్రిల్లింగ్ వ్యవహారమే...." అన్నాడు.

"థ్రిల్లింగ్ కాదు. ప్రాణాలు పోతాయి. జాగ్రత్తగా ఉండాలి....బ్లూ హార్నెస్‌తో వ్యవహారం...." హెచ్చరించాడు ఏజంటు 127.

"తెలుసు—అందులోనూ వాళ్ళు పాకిస్తాన్ గూఢచారులు కదా!"

"డియర్ డిటెక్టివ్! బ్లూ హార్నెస్ పాకిస్తాన్ గూఢచారి సంస్థ కాదు. అది కేవలం స్మగ్లింగ్ వ్యవహారాలకు సంబంధించిన సంస్థ. ఆ సంస్థకు దళారీలుగా వ్యవహరిస్తున్న మరో సంస్థ మాస్టర్ కీ వుంది."

"నాకు తెలుసు. ఈ ఊళ్ళో మాస్టర్ కీ గురించి నేను కొంత సమాచారం కూడా సేకరించాను...."

"ఎప్పుడు?" అన్నాడు ఏజంటు 127 ఆశ్చర్యంగా.

"విశాలపురం వచ్చేక నీనుంచి కబురు లేదు. ఊరికే కూర్చోలేక రంగంలోకి దిగాను. బ్లూ హార్నెస్ గురించి

సమాచారం లేదుగానీ మాస్టర్ కీ గురించి బోలెడు సమాచారం లభించింది. ఆ సంస్థకు సంబంధించిన ప్రముఖులు, సామాన్యులు కూడా కొందరు నాకు తెలిశారు...."

"వెరీగుడ్ వర్క్...." అభినందించాడు ఏజంట్ 127 "అయితే నేనిప్పుడు నీకో ముఖ్య సమాచారం అందిస్తున్నాను. మాస్టర్ కీ ఒక అంతర్జాతీయ సంస్థ. ఆ సంస్థ అవినీతికి పాల్పడినప్పటికీ దేశవిద్రోహకరచర్యలకు పూనుకోదు. ఇంకా చెప్పాలంటే మాస్టర్ కీ సంస్థ వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య అంతర్జాతీయంగా రహస్య అవగాహనలకూ, ధనం మార్పిడికీ సహకరిస్తూంటుంది. అందువల్లనే ఆ సంస్థ అన్నిదేశాల్లోనూ విజయవంతంగా నడుస్తోంది.

బ్లూ హార్సెస్ సంస్థ మాస్టర్ కీ నుంచి కొంత సహకారాన్నీ, సహాయాన్నీ పొందింది. కానీ మాస్టర్ కీ సంస్థకు-బ్లూ హార్సెస్ అసలు స్వరూపం తెలిసిపోయింది. దాంతో ఆ సంస్థ బ్లూ హార్సెస్‌కు సాయపడనని చెప్పేసింది. ఫలితంగా రెండింటికీ అభిప్రాయభేదాలు వచ్చాయి. బ్లూ హార్సెస్ తన దళారీలను వేరే నియమించుకోవలసి వచ్చింది.

ఆ దళారీలు తమ పనులు చూసుకోవడమేకాక— మాస్టర్ కీకి కూడా యిబ్బంది కలిగించసాగారు. ఉదాహరణకు—ఇప్పుడు నేను చెప్పిన ఇరవై కోట్ల బంగారం మాస్టర్ కీ సంస్థ గురించి వస్తోంది. ఆ సమాచారం అందుకున్న మాస్టర్ కీ సభ్యుణ్ని బ్లూ హార్సెస్ వ్యక్తి హత్య చేశాడు. ఆ బంగారం బ్లూ హార్సెస్‌కి స్వాధీనం చేయాలని అతడి అభిమతం. అతణ్ని నేను పట్టుకున్నాను. హత్య చేశాను. అతడివద్ద అనుకోకుండా ఆయుధ కర్మాగారాల

విశేషం తెలిసింది...."

"చాలా తమాషాగా వుంది ..."

"తమాషాకాదు—ప్రమాదం! ఇప్పుడు నేను నీకు ఇరవైకోట్ల బంగారం చేరే నిర్ణీత ప్రదేశం—అక్కడ చెప్పాల్సిన కోడ్—అన్నీ నీకు చెబుతాను. ఆ బంగారాన్ని నువ్వు స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించాలి. ఈలోగా నేను నా పనిలో ఉంటాను. నీవల్ల నాకు రెండు ప్రయోజనాలు. ఒకటి బంగారం ప్రభుత్వపరం కావడం. రెండు—నా శత్రువుల దృష్టిని తాత్కాలికంగానైనా నానుంచి మళ్ళించడం...."

"అంటే నువ్వీ యింట్లోనే వుండిపోతావా?"

"అవును. నేను బైటకు సందేశాలు పంపుకుని అన్ని యేర్పాట్లూ చేసుకోడానికి కొంత వ్యవధి కావాలి. ఈలోగా నువ్వు బంగారం స్వాధీనం చేసుకోవడం అయిపోవాలి...."

"మళ్ళీ నేను—నిన్నెప్పుడు కలుసుకోను?"

"మనమిద్దరం ప్రమాదకరమైన పనులకు పూనుకున్నాం. ఇద్దరిలో యే ఒక్కరైనా మిగలకపోవచ్చు. ఇద్దరిలో యే ఒక్కరు మిగిలినా—రెండోవారి ఆత్మశాంతికై ప్రార్థనలు జరుపుకుందాం. ఇద్దరూ మిగిలితే—మనమెలా కలుసుకుంటామో నేను నీకు చెబుతాను. ఈ రోజు నుంచి వారంరోజుల తర్వాత నానుంచి నీకే కబురు అందకపోతే నేను లేనట్లే లెక్క........" అన్నాడు ఏజంట్ 127.

"అయితే నాకా ఆయుధ కర్మాగారాల విషయం కూడా చెప్పు. ఎటువంటి ప్రమాదాలనుంచైనా నేను ప్రాణాలతో బైటపడగలనని నా నమ్మకం-" అన్నాడు

కిల్లర్.

"నువ్వు భయపడకు. నా ప్రాణంపోయినా సరే ఆ వార్త చేరవలసిన చోటుకు చేరుకుంటుంది. ఇక నేను చెప్పేది విను—" అన్నాడు ఏజంటు 127.

కిల్లర్ అతడు చెప్పిన వివరాలన్నీ నోట్ చేసుకున్నాడు. ఒకటికి రెండుసార్లు ఏజంటు 127 పోలీసుల సహాయం యేవిధంగా తీసుకోవాలో కూడా చెప్పి— "పోలీసుల్లో కూడా అందర్నీ నమ్మడానికి లేదు. అందుకే నీకన్నీ చెప్పాల్సి వస్తోంది—" అన్నాడు.

"సరే—ఇక నేను బయల్దేరుతున్నాను...."

"నీవిక్కడికి కాలినడకన వచ్చావు కదూ!"

"అవును ..."

"నీ మొబైల్ వ్యాను గురించి నాకు తెలుసు. అయితే ఈ ప్రయత్నంలో నీకోసం వేరే కారుంది. హోటల్ నటరాజ్ వద్ద పార్కు చేసి ఉంటుందది. నెంబరు APB 127. రంగు నీలం. తాళాలు రిసెప్షనిస్టునడిగి తీసుకో. అది మామూలు కారు కాదు. ఆ వివరాలన్నీ రిసెప్షనిస్టు తాళాలిచ్చినప్పుడు నీకిచ్చే కవర్లో వుంటాయి...."

"సరే—వెడుతున్నాను...." అన్నాడు కిల్లర్.

"ఈ యింటి గేటు దాటిన మరుక్షణం నుంచీ నీకు అడుగడుగునా ప్రమాదం. జాగ్రత్త...." అన్నాడు ఏజంటు 127 హెచ్చరికగా.

# 3

డిటెక్టివ్ కిల్లర్ గేటు దాటి బయటకు వచ్చి చుట్టూ చూశాడు.

ఎక్కడా యెవరూ కనబడలేదు. వీధిలో జనం

మసలుతున్నట్లే లేరు. అయినా అజాగ్రత్తగా లేకుండా వెయ్యి కళ్ళతో పరిసరాలను గమనిస్తూ ముందడుగు వేశాడు కిల్లర్. అయితే అతడినెవ్వరూ అనుసరించి కూడా వచ్చినట్లు లేదు.

అలా కొంత ముందుకు వెళ్ళాక కిల్లర్ కి ధైర్యం పెరిగింది. అతడు సుమారు ఇరవై నిమిషాలు నడిచి హోటలు చేరుకున్నాడు. అక్కడ రిసెప్షనిస్టును పలకరించి— "నాకోసం సందేశాలేమైనా ఉన్నాయా?" అనడిగాడు.

రిసెప్షనిస్టతడికి కారు తాళాలు, కవరు ఇచ్చాడు.

కిల్లర్ కారు తాళాలను పొంటుకున్న రహస్యపుటర లోకి తోసేశాడు. కవరు విప్పి లోపలి ఉత్తరం తీసి చదివాడు. అందులో APB 127 కారువల్ల సాధించగల బహుళ ప్రయోజనాలు వివరించబడ్డాయి. కిల్లర్ ఆ వివరాలన్నీ తన కంప్యూటర్ బుర్రలోకి పంపించేసి ఉత్తరాన్ని లైటర్ తో అంటించి నల్లగా మాడిపోయిన కాగితాన్ని పక్కనే వున్న డస్టుబిన్ లోకి జారవిడిచాడు.

రిసెప్షనిస్టతడి వంక నవ్వుతూ చూసి— "మీరు ఉత్తరాలను కాలుస్తుంటారా?" అన్నాడు.

కిల్లర్ తలూపి— "నాకు ప్రమాదకరమైన ప్రతిదాన్నీ అది ఉత్తరమైనా, మనిషైనా కూడా కాల్చడం నాకలవాటు—" అని అక్కణ్ణుంచి కదిలాడు.

"ఆలాగు బాగుంది కానీ ఇది మంచి మనిషి నోట రావలసింది కాదు—" అంటూ అస్పష్టంగా గొణిగాడు రిసెప్షనిస్టు. అతడి గొణుగుడు పూర్తయ్యేసరికి కిల్లర్ రూం నంబర్ పదిహేడులో ప్రవేశించి మంచంమీద వాలాడు.

"ఇప్పుడు తనేం చేయాలి?" అన్నదతడి ఆలోచన.

కిల్లర్ మొత్తం జరిగినదంతా ఆకళింపు చేసుకుని తన కార్యక్రమాన్ని రూపొందించుకుంటున్నాడు. మార్గ మధ్యంలో యెక్కడా ఆటంకం రానిపక్షంలో తను తిన్నగా ఏజంటు 127 సూచించిన పోలీసాఫీసర్ని కలుసుకోవాలి. ఆయన సాయంతో ఇరవైకోట్ల రూపాయలు విలువచేసే బంగారాన్ని స్వాధీన పర్చుకుని ప్రభుత్వపరం చేయాలి

కిల్లర్ ఆలోచిస్తున్నంతసేపూ కళ్ళు మూసుకునే వున్నాడు. ఆలోచన పూర్తికాగానే. అతడు కళ్ళు తెరిచాడు. అప్పుడతడి కళ్ళకు కనిపించాడో వ్యక్తి.

అయిదడుగుల ఆరంగుళాల ఎత్తు—ఎత్తుకు తగ్గ లావు బుగ్గమీసాలు—క్రూరంగా చూసే కళ్ళు — చేతిలో రివాల్వర్ ....

"బ్రతికే ఉన్నావన్నమాట...." అన్నాడతడు.

"ఎవర్నువ్వు?" అంటూ లేవబోయాడు కిల్లర్.

"ఆఁహ్—నువ్వు కదలకూడదు. అలాగే పడుకో. నేనడిగే ప్రశ్నలకు బుద్ధిగా జవాబు చెప్పు—...." అన్నాడు.

"ఎవర్నువ్వు? లోపలకెలా వచ్చావు?"

"ఇప్పుడు ప్రశ్నించే హక్కు నాకేగానీ నీకు లేదు. అయినా నీ ప్రశ్నల్లో తప్పేంలేదు కాబట్టి చెబుతున్నాను. నా పేరు బ్లూ రాస్కెల్. నేను లోపలకు నాకు మాత్రమే సాధ్యపడే శక్తిసామర్థ్యాలతో వచ్చాను—" అన్నాడతడు.

"ఏమిటి నీకు నాతో పని!"

"రేపీ ఊరు కిరవైకోట్లు విలువచేసే బంగారం

వస్తోంది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు—ఒక్క కోడ్‌వర్డ్ కావాలి. అదేమిటో చెప్పు...."

"తర్వాత?"

"బంగారం స్వాధీనం చేసుకునేందుకు నిర్ణీతస్థల మెక్కడ?"

కిల్లర్ నవ్వి—"నా సమాధానం నీకిరవైకోట్ల విలువ చేస్తుంది. మరి నాకేం ప్రయోజనం?" అన్నాడు.

"నీ ప్రాణాలు నిలబడడం...."

"నీవంటివాడి రివాల్వర్ చూసి భయపడి—ఇరవై కోట్ల రూపాయల రహస్యాన్ని కక్కేవాడినే అయితే—నా ప్రాణాలు నిలబడడం అనవసరం...."

"నువ్వు బ్లూ రాస్కెల్‌తో మాట్లాడుతున్నావు.... తెలుసుకో!"

"పేరుకాస్తే విలువ నివ్వకు. ఇచ్చేవంటే దెబ్బ తింటావు. నీ పేరు రాస్కెల్ అయితే నా పేరు కిల్లర్...."

"నీ పేరు కిల్లర్ కావచ్చు. కానీ నా చేతిలో రివాల్వర్ నన్నే కిల్లర్ని చేస్తుంది...."

"రివాల్వర్ చేతిలో వున్నవాళ్ళంతా కిల్లరయితే—నేను కిల్లరని పేరెందుకెట్టుకున్నట్లు?" అని నవ్వాడు కిల్లర్.

"ని ధైర్యానికి అభినందిస్తున్నాను. కానీ ధైర్యంతో ప్రాణాలు నిలబెట్టుకోలేవు. అనుభవంమీద చెబుతున్నాను. నా మాటను కాదంటే—ఇవే మాటలు నువ్వు కామరాజు, సలీం, ఎడ్వర్డ్‌లనుంచి కూడా వినాల్సి ఉంటుంది...."

"వాళ్ళెవరు?"

"నా మాటలు అడ్డుపెట్టకుండా ధైర్యం చేసిన కారణంగా ప్రస్తుతం స్వర్గంలో ఉన్న వాళ్ళు...."

కిల్లర్ అదోలా అతడివంక చూసి — "మైడియర్ బ్లూ రాస్కెల్! నీ గురించి నీకు తెలిసిందంతా నాకు చెప్పావు. నా గురించి యేమైనా నానుంచే తెలుసుకోవాలనుందా లేక సుబ్బారాయుడు, అల్లాఉద్దీన్, థామస్‌ల నుంచి వినాలనుందా?" అన్నాడు.

"వాళ్ళెవరు?"

"అంతర్జాతీయ నేరస్థులమని అంతు లేని గర్వం వాళ్ళకి. అభివృద్ధి చెందిన అమెరికావంటి దేశాలనే గడగడలాడించిన వాళ్ళిప్పుడు టీహార్ జెయిల్లో ఉన్నారు-"

బ్లూ రాస్కెల్ కిల్లర్ వంక తీక్షణంగా చూశాడు.

కిల్లర్ అతడికి చూపులతోనే బదులిస్తూ లేచి కూర్చున్నాడు.

"కదలొద్దని చెప్పాను.." అన్నాడు బ్లూ రాస్కెల్ కోపంగా.

"రహస్యం తెలుసుకోకుండా నన్ను చంపలేవని నాకు తెలుసు...."

"క్రమశిక్షణ ముఖ్యం నాకు. చెప్పినమాట వినకపోతే రహస్యం గురించి ఆలోచించకుండా కాల్చేయగలను..."

"నీ క్రమశిక్షణ యేమిటో—నీ పేరునుబట్టే తెలుసుకున్నాను...."

"మిస్టర్! ఇక డైలాగ్స్ కట్టిపెట్టి నేనడిగిందానికి చెప్పు. నాక్కావలసిందల్లా స్థలం పేరు—కోడ్ వర్...."

"స్థలం పేరు నేతాజీ పార్కు. కోడ్‌వర్డు—"దేశానికి భోజనం కాదు—దేశాన్ని భోజనం చేయడం నా అలవాటు....—"

బ్లూ రాస్కెల్ చిరాగ్గా — "కోడ్‌వర్డు అంటే ఒక్కటే పదం. నువ్వు చెప్పింది కోడ్ సెంటెన్స్...." అన్నాడు.

"నాకు తెలిసింది నేను చెప్పాను — అపైన నీ యిష్టం...."

"అంత సులభంగా నేను నిన్ను వదలను. రేపు ఇరవై కోట్ల రూపాయల బంగారం స్వాధీనం చేసుకునేదాకా నిన్ను నాకూడా ఉంచుకుంటాను...."

"ఉంచుకుంటానంటే మాత్రం నేను రావద్దూ?"

"ఈ రివాల్వర్ నిన్ను నాకు బానిసను చేసింది. కాదంటావా?"

"అంటాను—" అంటూ మెరుపు వేగంతో కదిలాడు కిల్లర్. క్షణాలమీద రాస్కెల్ చేతిలోని రివాల్వర్ క్రిందపడింది.

"నా దగ్గర ధైర్యం చేయడం ప్రమాదమని ముందే చెప్పాను. బుద్ధిగా రివాల్వర్ తీసి నాకివ్వు-నా బానిసవు కదూ!" అన్నాడు బ్లూ రాస్కెల్.

కిల్లర్ రివాల్వర్ అందుకుని—"ఇప్పుడు నువ్వు నా బానిసవు. కాదంటావా?" అన్నాడు.

బ్లూ రాస్కెల్ తల అడ్డంగా ఊపి—"వెర్రివాడా! ఆ రివాల్వర్లో బులెట్లు లేవు. కావాలంటే పేల్చిచూడు" అన్నాడు.

కిల్లర్ తెల్లబోయి—"ట్రిక్ చేశావన్నమాట— అయినా నీబోటివాణ్ని లొంగదీసుకునేందుకు నాకు ఆయుధాల అవసరంలేదు. నా చేతుల పస చూపిస్తాను" అన్నాడు.

"చూడు—ఈ గదిలో నాతోపాటు నా మనుషులు

మరో నలుగురున్నారు. ఈ గదిలోంచి నువ్వు బయటపడకుండా కాపలాకాయడమే కాదు—వాళ్ళ రివాల్వర్సు నీవైపే గురిపెట్టబడి ఉన్నాయి. అన్నట్లు—ఆ రివాల్వర్సులో తూటాలున్నాయి...."

కిల్లర్ చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు.

బ్లూ రాస్కెల్ చాలా తెలివైనవాడిలాగున్నాడు. తన సామర్థ్యమతడికి తెలిసే ఉండాలి. లేకుంటే తూటాలులేని రివాల్వర్‌తో తన్ను బెదిరించడు. తను మెరుపుదాడిచేసి రివాల్వర్ లాక్కున్నా బ్లూ రాస్కెల్‌కు ప్రమాదం లేదు.

ఇప్పుడు గదిలో నిజంగా మరో నలుగురు మనుషులున్నారా? బ్లూ రాస్కెల్ దబాయిస్తున్నాడా?

"నీ అనుమానం నాకు తెలుస్తోంది. అనవసరపు రక్తపాతం తప్పించడానికి నీ సందేహం తీరుస్తాను. ఈ గదిలోని ఒక వస్తువు పేరు చెప్పు. ఏం జరుగుతుందో చూడు...." అన్నాడు బ్లూ రాస్కెల్.

కిల్లర్ వెంటనే—"అదిగో ఆ టీపాయ్‌మీద యాష్‌ట్రే పేరు చెబుతున్నాను...." అన్నాడు.

అంతే—మరుక్షణం అది పేలిపోయింది.

కిల్లర్ అదిరిపడ్డాడు. బ్లూ రాస్కెల్ కదలలేదు. కానీ యాష్‌ట్రే పేలిపోయిందంటే అతడు చెప్పింది నిజమేనన్నమాట....

"మా వాడి ఉనికికి రుజువు చూశావు. వాడి గురి కూడా తెలుసుకున్నావు కదా—ఇక నీ దుడుకుతనం కట్టిపెట్టి నా ప్రశ్నలకు బదులు చెప్పు...." అన్నాడు బ్లూ రాస్కెల్.

"చెప్పకపోతే?"

"మిస్టర్! నా సమయం వృధా చేయకు. మేమంతా నీకంటే ఎన్నో రెట్లు శక్తిమంతులం. అయినా చిన్న పాముకైనా పెద్ద కర్రతో కొట్టాలనీ పిచ్చుకమీదకైనా బ్రహ్మాస్త్రం వేయాలనే అనుకునే తత్త్వం మాది. మాకు అహంకారంలేదు. అందుకని మా శక్తిని తక్కువ అంచనా వేయకు. దెబ్బతింటావు. నీవు నా రివాల్వర్ని పడగొట్టే అవకాశముందని నాకు తెలుసు. నీవీ గదిలోంచి పారిపోతావనీ నాకు తెలుసు. అన్నింటికీ యేర్పాట్లు చేసి ఉంచుకున్నాను.

నీకోసం ఒకటికాదు—రెండుకాదు....కొన్ని వందల వలలు వేసి వుంచాను. నువ్వు తప్పించుకోలేవు. నువ్వు తప్పించుకునే అవకాశాలన్నింటినీ ఊహించివేసిన మా పథకం అద్భుతమైనది. కాబట్టి మర్యాదగా మాతో రా—మాకు సహకరించు...."

"అందువల్ల నాకు ప్రయోజనం...."

"నీ ప్రాణాలు నీకు దక్కుతాయని ముందే చెప్పాను. నీ ప్రాణాల విలువ నీకు తెలిసినట్టులేదు కనుక—తోడుగా ఓ లక్షరూపాయలు కూడా బహుమతిగా యిస్తాను...." అన్నాడు బ్లూ రాస్కెల్.

"లక్షరూపాయలా—అంటే కోటికి అయిదువేలన్న మాట!"

"మరి ప్రాణాలో—వాటి విలువ కట్టలేదు నువ్వు?"

"నీ దృష్టిలో నా ప్రాణాలెంత విలువ చేస్తాయి?"

బ్లూ రాస్కెల్ నవ్వి—"నా దృష్టిలో నీ ప్రాణాలు పైస విలువ కూడా చేయవు! నేను చెప్పే విలువ నీ దృష్టిలో! ఇక కబుర్లు కట్టిపెట్టి మాతో రా—" అన్నాడు.

"వస్తాను. బాత్ రూం...." అన్నాడు కిల్లర్.

"బాత్ రూంలో మా మనిషున్నాడు. త్వరగా వెళ్ళి రా!"

"మనిషుంటే ఎలా?" అన్నాడు కిల్లర్.

బ్లూ రాస్కెల్ గట్టిగా—"మైడియర్ బాత్రూం! నువ్వు బయటకు రా—" అన్నాడు.

అప్పుడు బాత్రూం తలుపులు తీసుకుని ఓ వ్యక్తి బయటకు వచ్చాడు. అతడు నల్లగా నీగ్రోలా వున్నాడు. ఎత్తు. బలం సమతూకంగా ఉన్నాయి. చేతిలో రివాల్వరుంది.

"బాత్రూంలోంచి బైటకుపోయే దారేమీ లేదు...." అన్నాడతడు బ్లూ రాస్కెల్ నుద్దేశించి.

"సరే—నువ్వు వెళ్ళు. అయిదంటే అయిదు నిమిషాల్లో వెనక్కి రావాలి.." అన్నాడు బ్లూ రాస్కెల్.

"రాకపోతే?"

బ్లూ రాస్కెల్ నవ్వి—"కొన్ని ప్రశ్నలకు సమాధానాలుండవు. ఊహించుకోవాల్సిందే!" అన్నాడు.

"సరే—నాకు అయిదునిమిషాలు కూడా అవసరం లేదు. మూడంటే మూడు నిమిషాలు చాలు...." అంటూ కిల్లర్ బాత్రూంలో ప్రవేశించి లోపల్నుంచీ తలుపులు వేసుకున్నాడు.

అక్కడ అతడు క్షణం కూడా వృథా చేయలేదు. తిన్నగా టాయిలెట్ బౌల్ వద్దకు వెళ్ళాడు. దాన్నోసారి పట్టుకుని యెడమనుంచి కుడివైపుకి తిప్పాడు. వెంటనే పక్కగోడలో మనిషి పట్టేటంత కంత యేర్పడింది. కిల్లర్ ఆ కంతలోనికి వెళ్ళాడు. అందులోంచీ క్రిందకు

మెట్లున్నాయి.

అతడా మెట్లు దిగేసరికి గోడలోని కంత మూసుకు పోయింది. టాయిలెట్ బౌల్ యథాప్రకారం వెనక్కి తిరిగింది. మెట్లు కిల్లర్ని ఓ చిన్నగదిలోకి చేర్చాయి. ఆ గది తలుపులు తీసుకుని బయటకు వచ్చేడతడు. అది హోటల్ నటరాజ్ రిసెప్షన్ హాలు.

కిల్లర్ ఏజంట్ 127 ని మనసులోనే అభినందించు కున్నాడు. హోటల్ నటరాజ్‌లో రూం నంబర్ పది హేడులో ప్రత్యేకమైన యేర్పాట్లున్నాయంటే—ఈ హోటలుకీ—ప్రభుత్వ గూఢచారి శాఖకీ యేమో సంబంధ ముండి వుండాలి.

బాత్రూంలోంచి రిసెప్షన్ హాల్లో ప్రత్యక్షం కావ డానికి కిల్లర్‌కి మూడు నిమిషాలు కూడా పట్టలేదు. అతడు క్షణం కూడా జాప్యం చేయకుండా కారు పార్కింగ్ స్థలానికి వెళ్ళాడు. నీలిరంగు APB 127 అతడికి వెంటనే కనపడింది. కిల్లర్ జాప్యం చేయకుండా కారు తాళాలు జేబులోంచి తీశాడు.

అతడు కారెక్కి స్టార్టు చేయడానికెంతోసేపు పట్ట లేదు.

బ్లూ రాస్కెల్ చెప్పిందే నిజమైతే అతడు తను చేయబోయే ప్రతికార్యానికీ అడ్డు తగుల్తాడు. ఇప్పుడు కూడా తననెవరైనా గమనిస్తున్నారా?

ఏది యేమైనా ముందుగా తనిప్పుడు బ్లూ రాస్కెల్ నుంచి పారిపోవాలి. ఇరవైకోట్ల బంగారాన్నీ—తనే స్వయంగా సాధించాలి. అర్జంటుగా ముందు పోలీసులకు కబురు తెలియచేయాలి.

# 4

బ్లూ రాస్కెల్ మాత్రం తలుపులవైపే చూస్తున్నాడు. కిల్లర్ తలుపులు వేసుకుని మూడునిముషాలయింది.

కిల్లర్ బుద్ధిగా వెనక్కి తిరిగివస్తాడా లేక తన్ను మోసం చేస్తాడా — అని అతడాలోచిస్తూండగానే అతడి చేతిలోని వాకీటాకీ మ్రోగింది. చటుక్కున రిసీవర్ తీసుకుని — "ఏమిటి?" అన్నాడు.

"డిటెక్టివ్ కిల్లర్ రిసెప్షన్ హాల్లోకి వచ్చాడు. మీరు వదిలేశారా — అతడు తప్పించుకుని వచ్చాడా?" అందో గొంతు.

"వ్హాట్ —" అని ఉలిక్కిపడి — "నువ్వాణ్ణే కనిపెట్టి ఉండు. అతడు చేయిదాటి పోతూంటే మన వాళ్ళను కూడా పంపించు-" అన్నాడు బ్లూ రాస్కెల్.

"ఓకే —" అవతలి గొంతు.

"నేనిప్పుడే కిందకు వస్తున్నాను—" అంటూ రిసీవర్ని జేబులోకి తోసేశాడు బ్లూ రాస్కెల్. తర్వాత హడావుడిగా నల్లటి వ్యక్తి వంక చూసి — "నువ్వు బాత్రూం తలుపులు బలవంతంగా తెరిచిచూడు. లోపల కిల్లర్ లేకపోతే నాకా విషయం తెలియబర్చు. ఉంటే వెంటపెట్టుకుని కిందకురా. ఈ గదిలో కంటికి కనిపించకుండా మరో ముగ్గురు నిన్ను కాపాడుతూంటారు. ధైర్యంగా ఉండు.... నేను వెడుతున్నాను. అది నిజమో కాదో తెలియదు కానీ — కిల్లర్ పారిపోతున్నట్లు కబురొచ్చింది.." అనేసి గదిలోంచి బైటికి వెళ్ళిపోయాడు.

అతడు కిందకు వెళ్ళేసరికి ఓ వ్యక్తి రిసెప్షన్ హాల్లో అతణ్ణి పలకరించి — "మన APR 9-8 కిల్లర్ననుసరించి వెళ్ళింది. మనం కూడా వెడదామా?" అన్నాడు.

"ఆ వెళ్ళింది కిల్లరేనా? లేక అతడి డూపా?" అన్నాడు బ్లూ రాస్కెల్.

"ఏమో మరి—అచ్చం కిల్లర్లాగే వున్నాడు...." అంటూ అతడు ముందుకు నడిచాడు.

ఇద్దరూ పార్కింగ్ స్థలానికి వెళ్ళారు.

"మనం బయల్దేరుదామా?" అంటూ ఓ కార్లోకి వెళ్ళాడా వ్యక్తి.

బ్లూ రాస్కెల్ యేదో అనేలోగా అతడి జేబులో చిన్నగా శబ్దమయింది. బ్లూ రాస్కెల్ వాకీ టాకీ రిసీవర్ తీసుకొని దానికి ఇయర్ ఫోన్ ఫిక్స్ చేశాడు.

"తలుపు బద్దలు కొట్టారు. గదిలో కిల్లర్ లేడు. ఎలా మాయమయ్యాడో తెలియడంలేదు—" అందవతలి గొంతు.

"సరే—నువ్వు వెళ్ళిపోవచ్చు. ప్రస్తుతానికి నీతో పనిలేదు. నీకు రక్షణగా ఉన్నవాళ్ళని కూడా వెళ్ళి పొమ్మని చెప్పు. నేను వెడుతున్నాను...." అన్నాడు బ్లూ రాస్కెల్. అతడి మాటలంటున్నప్పుడు చూసే వాళ్ళకు కార్లోని వ్యక్తితో మాట్లాడుతున్నాడన్న అభిప్రాయం కలుగుతుంది.

"ఏమంటాడు మన బ్లాక్ హీరో?" అన్నాడు కార్లోని వ్యక్తి.

"కిల్లర్ పారిపోయాడు. నువ్వు చూసింది డూప్ని కాదు...."

"మనిషి అసాధ్యుడిలాగున్నాడే—" అన్నాడు కార్లోని వ్యక్తి.

"మనకంటే అసాధ్యుడు కావడానికి వీల్లేదు. ఈ కార్లో మన APR 978 ట్రాకవుతుందిగా—ఆ సిగ్న

ల్సును బట్టి పోలీస్....”

“ఓ.కే.—....”

బ్లూ రాస్కెల్ వున్న కారు స్టార్టయింది.

## 5

కిల్లర్ రియర్ వ్యూలో తననుసరించి వస్తున్న కారుని గమనించాడు.

అది ఎంత ప్రయత్నించినా తన కారును పట్టి వదలడంలేదు. దాని బారినుంచి తప్పించుకోవాలని అతడు తన కారును చాలా సందులు తిప్పాడు. ఎన్ని సందులు తిరిగినా ఆ కారు తన్ను వదలడంలేదు.

అలా కాసేపు గడిచేసరికి—ఒకటికి రెండు కార్లయినట్లు గుర్తించాడతడు. వందగజాల వెనుకనున్న వ్యక్తుల్ని కూడా స్పష్టంగా చూసే సదుపాయముండడంవల్ల—రెండో కార్లో బ్లూ రాస్కెల్ ఉన్నట్లు గుర్తించాడు కిల్లర్.

బ్లూ రాస్కెల్ సామాన్యుడు కాదు. అతడు తన్ను వదలడు. అతడిబారినుండి బంగారాన్ని కాపాడ్డం తన వల్లనవుతుందా అన్న అనుమానం కిల్లర్ని పట్టుకుని వేధిస్తోంది.

విశాలపురం పేరుకు తగ్గట్టే విశాలమైన నగరం. కధి పాత పల్లెటూరు ఆధారంగా నిర్మించబడ్డ కారణంగా ఆ ఊళ్ళో విసిరేసినట్లుగా రకరకాల కాలనీలున్నాయి. ఒక ప్రాంతానికీ మరో ప్రాంతానికీ మధ్య కిలోమీటర్ల దూరముండడమేకాక మధ్య రోడ్లు నిర్మానుష్యంగా కూడా వుంటాయి. ఎవరైనా తనకెదురుపడి అటకాయిస్తే బుద్ధి చెప్పాలని అనుకున్నాడు కిల్లర్. కానీ ముందే అన్నీ తెలిసినవాడిలా బ్లూ రాస్కెల్ అందుకు తలపడలేదు.

వెనుకనుంచి కారు టైర్లను పేల్చే ప్రయత్నం చేశారు బ్లూ రాస్కెల్ బృందం. కాని కారు టైర్లు బులెట్ ప్రూఫ్ కావడంవల్ల ఆ ప్రయత్నాలు ఫలించ లేదు.

ఉన్న కొద్దిరోజుల్లోనూ కిల్లర్ విశాలపురం సైసర్గిక స్వరూపాన్ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. కారు పారుచేసేముందు అతడు తన ప్రయాణ మార్గాన్ని నిర్ణ యించుకున్నాడు. అంత త్వరగా బ్లూ రాస్కెల్ మను షులు తన్ను తరుముతారని అనుకోకపోయినా అందుకు సిద్ధపడే ఉన్నాడతడు.

ఏదో సమయంలో తను బ్లూ రాస్కెల్ కన్ను గప్పాలి. అందుకతడి మెదడులో పథక మొకటి సిద్ధంగా వుంది. అందుకే అతడు కారును రైల్వేలైనున్న వీధిలోంచి పోనిస్తున్నాడు. అరోజు ఆ సమయంలో రావలసిన ట్రయిన్ సరైన సమయానికే వస్తోందని అతడికి తెలుసు. కాబట్టి రైల్వేగేటుకూడా సరైన సమయానికే మూత పడుతుంది. గేటు మూతపడడానికి కొద్ది సెకన్లముందా వీధిలో అతడు ప్రవేశించాడు. ఆగకుండా ప్రయాణంచేస్తే తను రైల్వేగేటు దాటి పోగలడు. కానీ తననను సరించి వస్తున్న కార్లు రైల్వేగేటుకవతల ఉండిపోతాయి.

కిల్లర్ అటువంటి పథకంలో వుంటాడని బ్లూరాస్కెల్ ఊహాకందడం కష్టం. కానీ....

కిల్లర్ కారు రైల్వేగేటుకు వందగజాల దూరంలో ఉండగా చటుక్కున ఓ వ్యక్తి రోడ్డుకడ్డంగా పడుకు న్నాడు.

జరిగిందానికి కిల్లర్ ఆశ్చర్యపోయాడు.

తను ముందుకు వెళ్ళాలంటే కారు మనిషిమీంచీ

పోవాలి. క్షణకాలం తను కారాపితే రైల్వేగేటు మూతపడిపోతుంది. రెండు కార్లు తనని సమీపిస్తాయి. తను తప్పించుకోవడం అసాధ్యం.

ఆలోచించడానిక్కూడా వ్యవధిలేదు కిల్లర్ కి. అతడు కారులో ఓ మీట నొక్కాడు. ఆ వెంటనే యాక్సిలరేటర్ బలంగా నొక్కాడు.

నేలమీద పడుకున్న వ్యక్తిని కారు సమీపించింది. ఆ వ్యక్తి కదలలేదు. మెదలలేదు. కిల్లర్ గుండె చిక్కబట్టుకున్నాడు.

అప్పుడు కార్లోంచి—రెండు హెడ్ లైట్సుకీ మధ్య స్థలంనుంచి రెండు హేండిల్సు ముందుకు వచ్చాయి. ఎవరో శాసించినట్లుగా అవి నేలమీద పడుకున్న మనిషిని పైకి లేపాయి.

కారు మాత్రం ఆగ లేదు. అది రైల్వేగేటును దాటగానే గేటు మూతపడింది. గేటుకవతల రెండుకార్లు ఆగిపోయాయి.

కిల్లర్ తేలికగా ఊపిరిపీల్చుకున్నమాట నిజం. కానీ అతడు రిలాక్సవలేదు. తననింకా యెవరో తరుముకు వస్తున్నట్లే అతడు కారును ముందుకు పోనిచ్చాడు. ఎవరికో తిప్పదారి పట్టించాలన్నట్లుగా అతడు కారును సందులు గొందులు తిప్పి ఓ యింటిముందాగాడు. తను కారు దిగి డోర్ లాక్ చేసి ఇంజను ముందుకు వచ్చాడు. అక్కడ కారుకున్న ఇనుపహస్తాల్లో ఆ మనిషి గిలగిలలాడుతున్నాడు. కిల్లర్ అతణ్ని విడిపించి హేండిల్సును లోపలకు తోసేశాడు.

ఆ వ్యక్తి కాస్త శ్రమపడి లేచి నిలబడ్డాడు.

కిల్లర్ అతణ్ని పలకరించలేదు. చేత్తో బలంగా ఇంటి

గుమ్మం దాకా ఈడ్చుకెళ్ళి అక్కడ కాలింగ్ బెల్ మ్రోగించాడు.

తలుపుకు నేమ్ ప్లేటుంది. ఎస్. పద్మావతి, సోషల్ వర్కర్ అని వ్రాసుందక్కడ.

కిల్లర్ 2. చేత్తో ఆ వ్యక్తిని గట్టిగా పట్టుకుని వున్నాడు.

తలుపులు తెరుచుకున్నాయి.

సుమారు ముప్ఫైయేళ్ళ యువతి గుమ్మంలో కనబడింది. ఆమె బయటి దృశ్యం చూసి తడబడింది.

"మేడమ్—మీరు పద్మావతి అనుకుంటాను. మీరు సోషల్ వర్కర్. నాకు సాయపడితే మీవల్ల సమాజానికి ఎనలేని సేవ జరుగుతుంది. మేము లోపలకు రావచ్చా?" అన్నాడు కిల్లర్.

ఆ యువతి గుమ్మానికడ్డం తప్పుకుంది.

కిల్లర్, ఆ వ్యక్తిని లోపలకు తోసి—తనూ లోపలకు వెళ్ళాడు. అప్పుడు తలుపులు వేసి ఆ యువతితో— "ఇతడు బ్లూ హార్స్ అనే ప్రమాదకరమైన సంస్థకు చెందిన వ్యక్తి. ఇతణ్ని బందీని చేసి కాసేపు మీ యింట్లో ఉంచుతాను—" అన్నాడు.

ఆ వ్యక్తి వెంటనే—"అయ్యా! నేనెవరి మనిషినీ కాదు. ఈ రోజుదయంనుంచీ నేను రైల్వేగేటు దగ్గర వున్నాను. గేటు మూతబడే సమయంలో యే కారైనా వేగంగా వస్తూంటే రోడ్డుకడ్డంగా పడుకోమని ఓ మనిషి చెప్పాడు. అందుకు వందరూపాయలు ప్రతిఫలంగా యిచ్చాడు—" అన్నాడు.

"ఎవరా మనిషి?"

"అతదెవరో నాకు తెలియదు కానీ చూస్తే గుర్తుపట్ట

గలను....”

“బందరూపాయలకోసం రోడ్డుకడ్డంగా పడుకుంటే-నీ ప్రాణాలుపోతే—ఏమవుతావు?” అన్నాడు కిల్లర్.

“నా ప్రాణాలకేమీ ప్రమాదముండదని ఆ మనిషి హామీనిచ్చాడు....”

“ఆ హామీని నువ్వెలా నమ్మావు? పోయే ప్రాణాలు నీవిగానీ అతడివి కాదుకదా!”

“అతడి మాటను నమ్మడంవల్ల నా ప్రాణాలు నిల బడతాయన్న ఆశ ఉంది. నమ్మినా నమ్మకపోయినా అతడిమాట నేను వినితీరాలి. లేకుంటే నా ప్రాణాలు పోతాయి—” అన్నాడా వ్యక్తి.

“సరే—నీ గురించి తర్వాత విచారిస్తాను-” అన్నాడు కిల్లర్. ఆ యువతి సాయంతో అతడా వ్యక్తికి కాళ్ళూ చతులు కట్టేసి ఓ గదిలో ఉంచాడు.

“మీరెవరు?” అందా యువతి.

“నా పేరు కిల్లర్—నేనొక డిటెక్టివును....”

“మీ పేరు విన్నాను....” అందామె.

“నాకెంత పాప్యులారిటీ వుందో తెలియదు. ప్రస్తుతం నాకెంతో వ్యవధిలేదు. ఒక ముఖ్య సమాచారా న్నందజేయడం కోసం నమ్మకమైన వ్యక్తికోసం ఎదురు చూస్తూ—మీ నేమ్ ప్లేట్ చూసి ఈ యింటిముందా గాను. మీ దగ్గర నేను రహస్యం దాచదల్చుకోలేదు. ఒక అర్జంటు సమాచారాన్ని మీరు నేను చెప్పిన చిరు నామాకు చేరవేయాలి....” అన్నాడు కిల్లర్.

“చెప్పండి....”

కిల్లర్ ఆమెకు బ్లూ హార్స్న్, మాస్టరీకీ సంస్థల గురించి క్లుప్తంగా చెప్పి—“రేపుదయం యెనిమిది గంటలకు

శారదా డ్రైక్లీనర్స్ షాపులో మేనేజర్ని కలుసుకుని కోడ్‌వర్డ్ చెప్పి ఇరవై కోట్ల రూపాయల బంగారం స్వాధీనం చేసుకోవాలన్న సందేశాన్ని మీరు నేను చెప్పినచోట అందజేయాలి. కోడ్ వర్డ్—మర్రిచెట్టు...." అన్నాడు.

పద్మావతి ఆశ్చర్యంగా—"మీరు నన్నెలా నమ్ముతున్నారు? ఇరవై కోట్ల రూపాయల బంగారమనగానే యెవరికైనా ఆశ పుడుతుంది...." అంది.

"మిస్ పద్మావతీ! నాకు మనుషుల ఎన్నిక బాగా తెలుసు. రేపు—అదే సమయానికి నేనూ అక్కడ వుంటాను. మీరు ఆత్యాశకుపోతే అదుపు చేయడం నాకు కష్టంకాదు. మీవంటి సోషల్ వర్కర్సు పోలీసులకు, ప్రభుత్వానికీ సాయపడడంవల్ల పేరు ప్రతిష్ఠలూ సంపాదించుకుంటారు. మీకు మంచి బహుమతీ ఉంటుంది ..."

పద్మావతి నవ్వి—"నావంటి సామాన్యులకు ఇరవై కోట్ల రూపాయల బంగారం కంటె—పదివేలరూపాయల బహుమతి తీసుకోవడంలోనే సుఖముంది. మీ మనుషుల ఎన్నికను నేనభినందిస్తున్నాను—" అంది.

"మరి నేను వెళ్లాలి. నా కారుకోసం బ్లూ హార్స్ మనుషులు వెదుకుతూంటారు. వాళ్ళు మీ యింటిని గుర్తించేలోగా నేనిక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. మీరు మాత్రం నా పని చేస్తారుకదూ! బహుమానం పదివేలకు మించే వుంటుంది—" అన్నాడు కిల్లర్.

"ష్యూర్-మరి నా యింట్లోని మనిషి నేం చేయను?"

"ఇంట్లో వుంచుకుందుకు మీకు భయంగా వుంటే పోలీసులకప్పగించండి. నేనతణ్ణింకా కొన్ని ప్రశ్నలు

వేయాల్సి వుంది...."

"సరే—అతణ్ణి పోలీసులకప్పజెబుతాను. నాకా మనిషంటే భయంలేదు—కానీ తిండీతిప్పలు లేకుండా అతడిసలా వదిలిపెట్టలేంగదా! పోనీ తిండి పెడదామన్నా పాలు పోద్దామని పాము దగ్గరకు వెడితే కాటేయదన్న గ్యారంటీ యేమిటి?" అంది పద్మావతి.

"యాజ్ యూ లైక్—ఓకే—టాటా....బైబై.." అంటూ కిల్లర్ ఆ ఇంట్లోంచి బైటకువచ్చి మళ్ళీ కారెక్కాడు.

అయితే ఆ తర్వాత అతడెంతోసేపు స్వతంత్రంగా లేడు. అతడు కొన్ని సందులు తిరిగి—ఓ దారిన వెడుతూండగా ఒక్కసారిగా నలువైపుల నుంచీ అతణ్ణి కార్లు చుట్టుముట్టాయి. ఒకటి కాదు—రెండు కాదు. ఒక నాలుగురోడ్ల కూడలిలో రోడ్డుకి రెండేసి చొప్పున యెనిమిది కార్లతణ్ణి అటకాయించాయి. కిల్లర్ వేరే దారిలేక కార్లోంచీ బయటకు వచ్చాడు.

అతణ్ణి సమీపించాడు మరో కార్లోంచి దిగివచ్చిన బ్లూ రాస్కెల్.

"అయాం సారీ!" అన్నాడు కిల్లర్.

"బట్—అయాం హాపీ—" అన్నాడు బ్లూ రాస్కెల్.

"ఎందుకు?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్యంగా.

"సరైన ప్రత్యర్థులు లేక విసిగిపోయాను నేను. ఏ పని తలపెట్టినా క్షణాలమీద పూర్తిచేయడం నా అలవాటు. ఒక పని పూర్తిచేయడానికి నూరు మెట్లు దాటి నిర్ణయిస్తాను. కానీ మొదటి మెట్టులోనే నా పనులై పోతాయి. నన్ను రెండో మెట్టుదాకా నడిపించినవారే

లేకపోయారు. ఇన్నాళ్ళకు నువ్వు నన్ను మెట్లు దాటిస్తున్నావు. అందుకు నా అభినందనలు.

నీకు నీ శక్తిసామర్థ్యాల పై అపారమైన నమ్మకముందని నాకనిపిస్తోంది. ఈపాటికి నువ్వు నా శక్తిని అంచనా వేసివుంటావు. బ్లూ హార్సెస్ సంస్థలో నేను ఉత్తర కుమారుడి వంటి వాణ్ని. నన్ను మించిన భీమార్జునులు నన్ను నడిపిస్తున్నారు. ఈ విషయాన్ని నువ్వు దృష్టిలో వుంచుకుని నాతో రావాలి. నువ్వెక్కడికి వస్తున్నావో నీకు తెలియదు. తెలుసుకుందుకు నీవు ప్రయత్నించ కూడదు—" అన్నాడు బ్లూ రాస్కెల్.

కిల్లర్ మాట్లాడకుండా బ్లూ రాస్కెల్ కారెక్కాడు. కార్లో కూర్చున్నాక అతడికి స్పృహ తెలియదు. స్పృహవచ్చేసరికతడో గదిలో మంచంమీద వున్నాడు. మంచం చుట్టూ నలుగురు మనుషులున్నారు. వారిలో బ్లూ రాస్కెల్ లేడు.

"ఎవరు మీరు?" అన్నాడు కిల్లర్.

"వియార్ బ్లూ హార్సెస్...." అన్నాడు వారిలో ఒకడు.

"నాతో మీకేమిటి పని?"

"ఇరవైకోట్ల రూపాయల బంగారం—కోడ్ వర్డు—నిర్ణీతస్థలం—త్వరగా చెప్పు. అబద్ధం చెబితే నీకే ప్రమాదం కాబట్టి నిజం చెప్పు—" అన్నాడు వారిలో ఒకడు.

"అబద్ధం చెబితే నాకెలాంటి ప్రమాదం?" అన్నాడు కిల్లర్.

"అదిగో—ఆ గోడకు వ్రేలాడుతున్న గడియారం కనపడుతోంది గదా—అది గడియారం మాత్రమే కాదు.

కంప్యూటరైజ్డ్ గన్ కూడా. నువ్వు నిజం చెప్పినంత సేపూ నీకేమీ ఫరవాలేదు. నువ్వు చెప్పే ఒకో అబద్ధం ఆ గడియారాన్ని ప్రేరేపింపజేస్తుంది. ఫలితంగా గన్ పేలుతుంది. దాని గురి ప్రోగ్రాం ప్రకారం నడుస్తుంది. అంటే ఒక గుండు నీ కన్ను పోగొడితే మరో గుండు నీ కాలు పోగొడుతుంది. నువ్వు క్రమంగా వికలాంగుడివై పోతావు తప్ప నీ ప్రాణాలు పోవు...."

"నా అబద్ధాలను తెలుసుకోగలిగిన కంప్యూటర్ నిజాలను తనకుతానై మీకు చెప్పలేదా? మళ్ళీ నేనెందుకు?" అన్నాడు కిల్లర్.

"అబద్ధం చెప్పేటప్పుడు మనిషి నరాలొక ప్రత్యేక పద్ధతిలో కంపిస్తాయి. కంప్యూటరా కంపనాన్ని గ్రహించగలదు. అందుకే అది అబద్ధాన్ని తెలుసుకో గలదు తప్ప నిజాన్ని చెప్పలేదు...."

కిల్లర్ తన చుట్టూ వున్న నలుగురి వంకా చూశాడు. నలుగురూ చూడ్డానికొక్కలాగే కనబడుతున్నారు. నలుగురూ గ్రే కలర్ సూట్లో ఉన్నారు. నలుగురి ముఖాలకూ ఒకేలాంటి గుబురు మీసాలున్నాయి. నలుగురూ ఒకేలాంటి నల్ల కళ్ళద్దాలు ధరించారు. నలుగురూ ఒకే ఛాయలో వున్నారు.

"స్థలం శారదా డ్రైక్లీనింగ్ షాపు. కలుసుకోవలసింది షాపు మేనేజర్ని. సమయం రేపుదయం ఎనిమిది గంటలు. కోడ్ వర్డు మర్రిచెట్టు..." అన్నాడు కిల్లర్.

"ఇతడు నిజమే చెప్పాడు—" అన్నాడు వారిలో ఒకడు.

"మరి నన్ను వదిలేస్తారా?" అన్నాడు కిల్లర్.

"రేపు—శారదా డ్రైక్లీనింగ్ షాపువద్ద వదులుతాం

నిన్ను. అంతవరకూ ఇక్కడే నిద్రపో....” అన్నాడు వారిలో ఒకడు.

కిల్లర్ ఏదో అనాలనుకున్నాడు. అతనికి నిద్ర ముంచుకు వచ్చింది.

## 6

మర్నాడుదయం ఎనిమిది గంటలు కావడానికింకా అయిదునిముషాలుందనగా — శారదా డ్రైక్లీనింగ్ షాపు ముందు-ఒకదానికొకటి యెదురుగా రెండు కార్లాగాయి.

నీలిరంగు కార్లోంచి గ్రే సూట్లో వ్యక్తి ఒకడు దిగాడు. దానికెదురుగా ఆగిన కార్లోంచి బ్లాక్ సూట్లో వ్యక్తి ఒకడు దిగాడు. ఇద్దరూ ఒకేసారి షాపులో అడుగుపెట్టారు. మేనేజరు వారి వంక చూశాడు. ఇద్దరూ అతడికి చెరో స్లిప్పూ అందించారు.

స్లిప్పుమీద—“కోడ్ వర్డు—మ్యారినెట్టు” అని వ్రాసి వుంది. రెండు స్లిప్పులోనూ ఒకే కోడ్ వర్డు వ్రాసి వుండటంతో మేనేజర్ ఆశ్చర్యపడ్డాడు అతడు రెండు స్లిప్పుల మీదా కూడా—“మీ పరివారంతో లోపల హాల్లోకి వెళ్ళండి—” అని వ్రాసి వెనక్కిచ్చేశాడు.

కొద్దిక్షణాల్లో నీలిరంగు కార్లోంచి మొత్తం ఆరుగురు డ్రైక్లీనింగ్ షాపులోంచీ — లోపల హాల్లోకి వెళ్ళారు. ఆ వెనుకే ఎర్రకార్లోంచి ఆరుగురు వ్యక్తులు కూడా ఆ హాల్లోకే వెళ్ళారు.

హాలు విశాలమైనదే! కానీ అందులో కూర్చునేందుకు కుర్చీలు లేవు. గోడవారగా ఒక బల్ల వుంది. ఆ బల్ల మీద పది బ్రీఫ్ కేసులు—రెండు వరసల్లో ఒకదాని మీద ఒకటి పేర్చబడి ఉన్నాయి.

బల్ల వెనుక ఓ మనిషి వున్నాడు. అతడు సుమారు

ఏడడుగుల పొడవున్న పాశ్చాత్యుడు. మనిషి సన్నగా వున్నాడు.

హాల్లో అడుగు పెట్టిన పన్నెండుగురినీ చూసి—"మీరందరూ ఒక సంస్థకు సంబంధించిన వారే కదూ!" అన్నాడు.

ఎర్ర కారు మనుషులు — నీలి కారు మనుషులు విడి విడిగా ఒకరికొకరు యెదురుగా వున్నారు. రెండు గుంపులూ ఒకరినొకరు తీవ్రంగా చూసుకున్నారు.

నీలికారు గుంపులో కిల్లరున్నాడు.

ఎర్రకారు గుంపులో పద్మావతి వుంది.

కిల్లర్ పద్మావతి వంక చురుగ్గా చూస్తున్నాడు. పద్మావతి అతడి వంక హేళనగా చూస్తోంది.

"డియర్ ఫ్రెండ్స్—మీ గురించి మీరు చెప్పాలి. మీరిద్దరూ ఒకే సంస్థకు చెందిన మనుషులైతే కోడ్ వర్డ్స్ రెండు స్లిప్పుల్లో యెందుకిచ్చారు? రెండు సంస్థలకు చెందిన మనుషులైతే కోడ్ వర్డ్స్—ఒకటికి బదులుగా రెండు సంస్థలకెలా తెలిసింది? మీరు జవాబు చెప్పాలి. క్విక్...."

నీలికారు మనుషులు ముఖముఖాలు చూసుకున్నారు.

ఎర్రకారు మనుషుల్లో ఒకడు ముందుకు వచ్చి—"మేము మాస్టర్ కి సభ్యులం. మాకందవలసిన సందేశాన్ని బ్లూ హార్సెస్ మనుషులు లాగేశారు. కానీ యెలాగో తెలివిగా ఆ సందేశాన్ని సంపాదించి సమయానికిక్కడకు చేరుకున్నాం—మా ఎదుటవున్న గ్రే కూటు మనుషులు—బ్లూ హార్సెస్ కు చెందినవారు...." అన్నాడు.

"అవునా?" అన్నాడు బల్ల వెనుక మనిషి.

"అవును. కానీ మేము బంగారం తీసుకునే ఇక్క

త్నించి వెడతాం. మమ్మల్నెవ్వరూ ఆపలేరు—" అన్నాడో గ్రే సూటువాలా.

"ఇక్కడెవరూ గాజులు తొడిగించుకోలేదు—" అన్నాడో ఎర్రకారు మనిషి.

గ్రే సూట్ వాలా నవ్వి—"మీలో గాజులు తొడిగించుకున్న వాళ్ళొకరున్నారు—" అన్నాడు పద్మావతి వంక హేళనగా చూస్తూ.

"నా గాజుల ప్రభావం ఇప్పుడే చూద్దువుగాని—" అంటూ పద్మావతి చటుక్కున తన చేతిగాజు నొకదాన్ని తీసి నేలమీద కొట్టింది. క్షణాలమీద గదిలో ఏదో వాయుపదార్థం ఆవహించుకుంది. చూస్తూండగా కిల్లర్ తో సహా—నీలికారు మనుషులారుగురికీ స్పృహ తప్పింది. బల్ల వెనుక మనిషి కూడా స్పృహతప్పి పడిపోయాడు.

"గుడ్ వర్క్—పద్మా!" అంటూ ఆ గుంపులో నల్ల సూట్ వ్యక్తి పద్మావతిని మెచ్చుకుని—"కమాన్—మనలో ప్రతి ఒక్కరూ—రెండేసి బ్రీఫ్ కేసులచొప్పున బయటకు తీసుకువెళ్ళాలి—" అన్నాడు.

"అంత బరువు మనం మోయలేము. ట్రాలీలో బైటకు తీసుకుని వెళ్ళాలి—" అన్నాడు వారిలో ఒకడు.

అందరూ బల్లదగ్గరకు వెళ్ళి బ్రీఫ్ కేసులు పట్టి చూశారు. ఇరవైకోట్లు విలువచేసే బంగారం పది బ్రీఫ్ కేసుల్లో సర్దుకుంది. ఆ బ్రీఫ్ కేసుల్ని మోయడం అంత సులభంకాదు.

"నేను ట్రాలీ తీసుకుని వస్తాను—" అంటూ బ్లాక్ సీటు వ్యక్తి హాల్లోంచి శారదా డ్రైక్లీనింగ్ షాపు మేనేజరు వద్దకు వెళ్ళాడు. మేనేజరతడి వెంటనే ఓ ట్రాలీ ఇచ్చాడు. ట్రాలీలో బ్రీఫుకేసులు షాపు బైటకు

వచ్చాయి. వాటిని కార్లోకి లోడ్ చేశారు వాళ్ళు. తర్వాత ట్రాలీ షాపు మేనేజరు కప్పగించి కారు స్టార్టు చేశారు వాళ్ళు.

కారులో అంతా పద్మావతికి అభినందలు కురిపిస్తూ— "నీవు లేకుంటే మాస్టర్ కీ సంస్థ ఈ రోజు ఇరవై కోట్లు నష్టపోయుండేది—" అన్నాడు.

పద్మావతి తనలో తానే ముసిముసిగా నవ్వుకుంటూ— "డిటెక్టివ్ కిల్లర్ నన్ను సంఘసేవికగా భావించడంవల్ల ఇదంతా జరిగింది. నేను పోలీసులకు సమాచారం అందచేస్తానని అతడు నమ్మాడు. నేను మాస్టర్ కీ సంస్థ సభ్యురాలినని అతడికి తెలియకపోవడం నా అదృష్టం. ఇందాకా మనం ప్రయోగించిన విషవాయువుతో అతడి కథ కూడా ముగిసినట్లే—ఓ గంటలోగా యెవరైనా విరుగుడు ప్రయోగిస్తే తప్ప ఆ హాల్లోని వారెవ్వరూ ప్రాణాలతో బైట పడలేరు—" అంది.

కారు పద్మావతి ఇంటి ముందాగింది.

"లెటజ్ సెలబ్రేట్!" అన్నాడు కార్లోని వ్యక్తి.

కార్లోంచి అందరూ దిగి పద్మావతి ఇంట్లోకి వెళ్ళారు. లోపల అంతా కుర్చీల్లో కూర్చోగానే ఒక్కసారిగా వారిని యాభైమంది సాయుధులు చుట్టుముట్టారు.

వారిలోంచి ఓ వ్యక్తి ముందుకువచ్చి—"డిటెక్టివ్ కిల్లర్ సామాన్యుడు కాదు. కేవలం బంగారం ప్రభుత్వ పరంచేయడం అతడి బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంతోపాటు బ్లూ హార్నెన్, మాస్టర్ కీ సంస్థలకు చెందిన కొందరు ముఖ్యుల్ని కూడా పట్టుకోవడం అతడికెలా సాధ్యపడిందో నాకర్థంకావడంలేదు. మీరందరూ మర్యాదగా తూకు లొంగిపొండి. బయట పార్కు చేసిన

## 41

హూ కారును పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. శారదా డ్రైక్లీనింగు షాపులో మూర్ఛపోయిన ఏడుగురికీ ప్రథమ చికిత్స జరుగుతోంది........" అంటూ ఏదో అంటూండగా—

"మీ రెవరు?" అంది పద్మారతి.

ఆతడు తన పేరు చెప్పగానే ఆమె ఉలిక్కిపడింది. నిన్నటి దినం కిల్లర్ తనకిచ్చిన చిరునామా— పేరతడిదే! అంటే కిల్లర్ ఆ చిరునామాకు సందేశం అందజేయడానికి వేరే ఏర్పాట్లు చేసి వుండాలి. అంటే తను—మాస్టర్ కీ సంస్థలో సభ్యురాలినని అతడికి ముందే తెలిసి వుండాలి!

— అయిపోయింది —